ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 23-9-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహం యొక్క రంగులు తేడా, మనస్సులో ఉన్న గుణాలు తేడా ఎవరి స్వభావం వారిది కాని అందరి హృదయాలలో సత్యవస్తువు ఒక్కటే. మనస్సు ఉన్నప్పుడు ఎవరికి వారే, మనస్సు లేనప్పుడు అందరూ ఒక్కటే. ఆధ్యాత్మిక బోధలు మీరు అందరూ శ్రవణం చేయటం అవసరం. శ్రవణం చేయటం వలన మీలో ఉన్న బలహీనతలు తెలుస్తాయి. బలహీనతలు తెలిసినప్పుడు వాటిని తొలగించుకొనే ప్రయత్నం చేస్తారు. మన కుటుంబ సమస్యలకి, సమాజంలో వచ్చే సమస్యలకి ముఖ్యంగా అజ్ఞానం కారణం. నూటికి ఎనభై సమస్యలు అజ్ఞానపరంగా వస్తున్నాయి. అజ్ఞానం వలన వస్తున్నాయి అని మనకు తెలియటంలేదు. మన ఇంట్లో ఉన్న మనుషులు సంసారం కాదు. మరణించటం, జన్మించటం సంసారం. నీవు ఈ సంసారంలో కొట్టుకొని పోతున్నప్పటికి పెద్దలు చెప్పిన మాటలు విని జ్ఞానాన్ని సముపార్జిస్తే నీవు సంపాదించిన జ్ఞానం ఒక నావ క్రింద ఉపయోగపడి ఈ సంసార సముద్రం నుండి ఒడ్డుకు రావటానికి నీకు ఉపయోగపడుతుంది అని పరమేశ్వరుడు చెపుతున్నాడు. ఇతరుల గొడవలు మీకు వద్దు. మీరు జ్ఞానాన్ని సంపాదించుకొంటే ప్రకృతిలో నుండి పరమేశ్వరుని వైపుకు రావటానికి అదే నీకు సహకరిస్తుంది.

జీవితం అంతా తలంపులే. అయితే అన్ని తలంపులకు ఒక మొదటి తలంపు ఉంది. ఆ మొదటి తలంపునే మూల తలంపు అంటారు. అది వచ్చాక ఇతర తలంపులు వస్తాయి. ఆ మొదటి తలంపు యొక్క మూలంలోనే పరమేశ్వరుడు ఉన్నాడు. పరమేశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే ధృడవిశ్వాసం నీకు కలిగితే 50 శాతం మనస్సు అణిగిపోతుంది. పరమేశ్వరునిపై విశ్వాసం ఉన్నవారికి మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది. నీవు ఎవడో నీకు తెలిస్తే నీ హృదయంలో ఉన్న పరమేశ్వరుని గురించి నీకు తెలుస్తుంది. నీవు ఎవడో నీకు తెలియకపోతే పరమేశ్వరుని గురించి నీకు తెలియదు. నేను, నేను అని మనస్సు అంటోంది. నేను ఎవడను? అనే ప్రశ్న ఎందుకు అంటే మనస్సును నియమించటానికి, మనస్సును దాని మూలంలోనికి పంపటానికి ఈ ప్రశ్న ఉపయోగపడుతుంది. జపం వలన, ధ్యానం వలన మనస్సు అణుగుతుంది గాని మనస్సు నశిస్తుంది అని చెప్పలేము. మనస్సు దాని మూలాన్ని చూస్తేనే గాని అది నశించదు. అందువలన మనస్సును దాని మూలంలోనికి వెళ్ళేవరకు ఉపసంహరించాలి. మనస్సు దాని మూలాన్ని ఎప్పుడైతే చూసిందో అది నశిస్తుంది. నీకు మనోమూలం తెలియదు అనుకో నేను రాముడిని చూసాను, కృష్ణుడుని చూసాను అంటావు అనుకో ఈ లోకము, దేహము, నీ మనస్సు ఎంత నిజమో నీ కళ్ళకు కనిపించే ఆ దేవుళ్ళు కూడా అంతే నిజం. మనోమూలంలోనే భగవంతుడు ఉన్నాడు. కాని ఆయన మీద మనకు నమ్మకం

లేదు. గుడిలో ఉన్న దేవుని మీద మనకు నమ్మకం ఉంది. దీనికి మన దేహబుద్ధి కారణం. మనస్సు ఉన్నంతవరకు దేహంలోపల నేను ఉన్నాను, దేహం బయట ప్రపంచం ఉంది, ఎక్కడో భగవంతుడు ఉన్నాడు అనుకొంటావు. ఇది అంతా మనస్సు యొక్క కల్పన. మనస్సు నశిస్తే ఉన్నది ఒక్కటే అన్న సంగతి, అదే అంతటా ఉంది అన్న సంగతి నీకు తెలుస్తుంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా ఎప్పుడైతే నీకు వ్యక్తమయిందో ఈ జననాలు, మరణాలు అన్నీ కూడా ఒక స్వప్నమే అన్న సంగతి నీకు అవగాహన అవుతుంది.

బాహ్యంగా నీవు చేసే పనిని భగవంతుడు చూడడు. లోకం నీవు చేసే పనిని చూస్తుంది. భగవంతుడికి అది అక్కరలేదు. నీవు చేసే పని ఎందుకు చేస్తున్నావు, ఏ భావనతో చేస్తున్నావు అది భగవంతుడు చూస్తాడు. దానిని బట్టి నీ ఆధ్యాత్మిక అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. నీ పునర్జన్మ కారణాలు భగవంతుని దగ్గరలేవు. నీ మనస్సులోనే ఉన్నాయి. మన మనస్సు నశిస్తేగాని అందులోని గుణాలు నశించవు. ఎవడి మనస్సు వాడికి శిక్ష. నీ శరీరం మరణించక ముందే ఇప్పుడే ఈ భూమి మీద మనం తిరుగుతున్నప్పుడే భగవంతుని మీద పరిపూర్ణమైన విశ్వాసం పెట్టుకొని ఆచార్యపురుషుడు చెప్పిన మాటలు శ్రద్ధగా శ్రవణం చేసి, ఆ మాటలను కూడా భగవంతునితో సమానంగా గౌరవిస్తూ ఆ ప్రకారం జీవిస్తే మనస్సు కరిగిపోతుంది. ఎప్పుడైతే మనస్సు కరిగిపోయిందో మన హృదయంలో ఉన్న శాంతిసముద్రం పొంగి సహస్రారమును ముంచేస్తుంది. ఎప్పుడో వస్తుంది అనుకొన్నది ఇప్పుడే వస్తుంది. ఎక్కడో తెలుస్తుంది అనుకొన్నది ఇక్కడే తెలుస్తుంది. అయితే మనం చేసే పని, మాట్లాడే మాట వలన మనస్సు చిక్కపడకూడదు, మనస్సు పల్చబడాలి. నీ హృదయంలో సత్యవస్తువు ఉంది, అదే బ్రహ్మము, అది తలంపు కాదు. అది భావన కాదు. ఆ వస్తువు మీద నీకు విశ్వాసం ఉన్నా అది ఉంది, విశ్వాసం లేకపోయినా అది ఉంది. నాస్తికులు కాదన్నా, హేతువాదులు హేళన చేసినా నీ లోపల ఉన్న వస్తువు లేకుండా ఎక్కడికి పోతుంది. జీవితంలో అన్నీ తలంపులే. కాని ఈ తలంపులతోటి సంబంధం లేకుండా స్వతంత్రంగా ఉన్న వస్తువు బ్రహ్మము ఒక్కటే.

రమణమహర్షిగారి బోధ విశ్వాసాల మీద, నమ్మకాల మీద ఆధారపడి లేదు. మీరు ఉదయం నిద్రలోనుండి మెలుకువలోనికి వచ్చేటప్పుడు హృదయంలో నుండి అతి వేగముగా నేను అనే తలంపు వస్తుంది. ఆ మొదటి తలంపు వచ్చిన తరువాత మీరు దేహంతోటి, రంగుతోటి, మతంతోటి, కులంతోటి తాదాప్యం పొందుతారు. అది వచ్చిన తరువాత మిగతా తలంపులు వస్తాయి కాని అది ఉదయించకపోతే మిగతా తలంపులు రావు. నేను తెల్లగా ఉన్నాను అనుకొంటాను. ఆ తలంపు ఎవరికి వస్తోంది? నీకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో దానికి ఈ తలంపు వస్తోంది. అయితే నేను తెల్లగా ఉన్నాను అని ఆ నేను ఎందుకు అనుకుంటోంది. గాఢనిద్రలోనుండి జాగ్రదావస్థలోనికి రాగానే ఆ నేను నీ దేహంతోటి తాదాప్యం చెందుతుంది. దేహంతో తాదాప్యం చెందటం వలన నేను తెల్లగా ఉన్నాను, నేను నల్లగా ఉన్నాను అంటోంది. ఆ మొదటి తలంపు వచ్చి రంగుతోటి తాదాప్యం చెందుతోంది. ఆ మొదటి తలంపే సైతాను, ఆ మొదటి తలంపే నరకాసురుడు. దానిని

ఎప్పుడైతే మూలంతో సహా తొలగించావో ఆరోజే దీపావళి. ఆ మూల తలంపు యొక్క మూలం తెలుసుకోకుండా శరీరం శవం అయ్యింది అనుకోండి Your loss is great. మూలతలంపు యొక్క మూలంలో ఉన్న ఆత్మ యొక్క అనుభవం పొందకుండా శరీరం చనిపోతే మీరు పోగొట్టుకొన్నది అంత ఇంత అని మాటలతో చెప్పలేము. నీవు ఎవరో నీవు తెలుసుకోకుండా నీ శరీరం శవమైతే నీవు చాలా నష్టపోతావు.

మనం ఈ భూమి మీదకు వచ్చిన పని ఏమిటి అంటే మనం ఎవరిమో మనం తెలుసుకోవటమే.ఆ పని పూర్తి చేసుకోకుండా భౌతికంగా నీవు ఎన్ని సాధించినా ఒకటి లేని సున్నలతో సమానము. నీవు పనిచేసినా పనిచేయకపోయినా, దేవుడిని పూజించినా పూజించకపోయినా, నీకు కోపం వచ్చినా నీవు కుదురుగా ఉన్నా నీ లోపల ఉన్న వస్తువు అది అలాగే ఉంది. మిమ్మల్ని చూస్తూ ఉంది. మీ గొడవలలో కలుగచేసుకోదు. వారు లోపల ఉంటారు, ఊరక ఉండరు. నీకు వచ్చే తలంపును చూస్తూ ఉంటారు. మనకు మరు క్షణంలో ఏ తలంపు వస్తుందో చెప్పలేము. భగవంతుడు ఏమి చేస్తూ ఉంటాడు అంటే దేహప్రారబ్ధమును బట్టి ఏక్షణంలో ఏ తలంపు రావాలో అది తీసుకొని వచ్చి నిన్ను ఆడిస్తూ ఉంటాడు. తలంపులు లేని వస్తువును పట్టుకొనేవరకూ ఈ తలంపుల చేత మీరు పీడింపబడతారు. నీవు, నేను, నీ కళ్లకు కనిపించే ప్రపంచం, ఇతర లోకాలు, నీవు పూజించే దేవుళ్ళు అన్నీకూడా నేను అనే మొదటి తలంపు అనే ఒంటి స్తంబం మీద ఆధారపడి ఉన్నాయి. దానిని కూల్చివేస్తే ఏమీలేదు. నీకు ఉన్న ఈ మొదటి తలంపు యొక్క రిస్కు తగ్గాలంటే దేహభావన లేకుండా పని చెయ్యి. అందరూ ఒకేపని చేయరు. ప్రారబ్ధమును బట్టి దేహయాత్ర జరుగుతూ ఉంటుంది. నీవు దానితో తాదాప్యం పొందకుండా, కర్తృత్వం లేకుండా పని చెయ్యటం నేర్చుకొంటే వస్తువు దాని అంతట అదే నీకు తెలుస్తుంది. నీవు దాని దగ్గరకు వెళ్లనక్కరలేదు. అదే నీ దగ్గరకు వచ్చి నిన్ను వరిస్తుంది. భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశములను జ్ఞానం సంపాదించటానికి ఉపయోగించుకో. ఆ అవకాశములను సద్వినియోగం చేసుకొంటే ఒకేసారి మనకు మోక్షం రాకపోయినా పునర్జన్మ మంచి జన్మవస్తుంది. అంటే ఆధ్యాత్మికంగా ఇంకా అభివృద్ధి లోనికి రావటానికి అనుకూలమైన జన్మను ఇస్తాడు. ఆ అవకాశములను సద్వినియోగం చేసుకోకపోతే నీచజన్మలు వస్తాయి. జ్ఞానయోగం అంటే ఏదీ నాదికాదు అనుకోవటం, కర్మయోగం అంటే అంతానాది అనుకొనిపనిచేయుటం. మనం అన్నియోగాలను సమన్వయం చేసుకొని భగవంతుని పాదాలను ఆశ్రయించి భగవంతునిలో ఐక్యం కావాలి. ❄ ❄ ❄

(శృంగవృక్షంలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 26-9-98)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతునికి రూపంలేదు, నామంలేదు. కాని రూపం ధరించి వచ్చి భూమిమీద తిరుగుతాడు. ప్రారబ్దం అనుభవించటానికి కాదు, మనకు సందేశం ఇవ్వటానికి వస్తాడు. ఏదైనా పని చేసేటప్పుడు విచక్షణ ఉండాలి. దేహమే సర్వస్వం అని అనుకోకూడదు. దేహయాత్రకు మనం పనులు

చేసుకొంటున్నప్పటికి ఏది నిత్యం ఏది అనిత్యం, ఏది విడిచి పెట్టాలి ఏది పట్టుకోవాలి అనే విచక్షణ ఉండాలి. విచక్షణ చాలా ముఖ్యం. మనకు ఇష్టమైన భగవంతుని రూపమును ఉపాసన చేసుకోవటం వలన వ్యర్థమైన తలంపులు ఆగిపోతాయి. కొంతమంది మాట్లాడే మాటలో మృదుత్వం ఉండదు, మంచితనం ఉండదు. వారి ఆలోచన, వారు చేసేపని వారికి ఉపయోగపడదు, ఇతరులకు ఉపయోగపడదు. ఇలా వ్యర్థమైన మాటలతో, వ్యర్థమైన ఆలోచనలతో, వ్యర్థమైన పనులతో కాలమును పాడుచేసుకోకూడదు.

మనం అసత్యమైన నేనుతో కొన్ని వేలజన్మల నుండి కలిసి ఉన్నాము. సాధన చేసి దానిని పోగొట్టుకోవటానికి ఇప్పడు ప్రయత్నం చేస్తున్నాము. నీవు, నేను చాలాకాలం కలిసి ఉన్నాము. ఇప్పడు నిన్ను వదిలిపెట్టి ఎక్కడికి పోతాను అని అది అంటోంది. ఈ అసత్యమైన నేను వూరికే ఉండమంటే ఉండదు. ఎంతసేపు డబ్బుతోగాని, చదువుతోగాని, రూపంతోగాని, నామంతోగాని, గౌరవంతోగాని ఇలా ఏదో ఒకదానితో తాదాప్యం చెందుతూ ఉంటుంది. ఈ అసత్యమైన నేను రూపంలోనే మాయ ఉంటుంది. నా మాయను ఎవరూ జయించలేరు అన్నాడు కృష్ణుడు. మనం దానిని పోగొట్టుకోవటానికి హృదయపూర్వకంగా ప్రయత్నం చేయటంలేదు. పోనీ వీరిని వదిలి వెడదామని అదీ అనుకోవటంలేదు. ఇదీ పరిస్థితి. అందుచేత మీరు ఏ దేవుని ప్రార్థించినా దానిని పోగొట్టుకొనే పద్ధతిలో ఉండాలి. దేవుని కంటే మిధ్యానేను అంటేనే మనకు ఎక్కువ ఇష్టం. ఈ మిధ్యానేను కల్పించిన విషయాల గురించి మీరు ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటారు కాని దేవుని గురించి ఆలోచించరు. ఒకవేళ భగవంతుని గురించి ఏప్పడైనా ఆలోచించినా మిధ్యా నేను ఏ కోరికలయితే కోరుతుందో ఆ కోరికలు తీర్చమని భగవంతుని ప్రార్థిస్తారు. కోరి తెచ్చుకొన్నది ప్రతీదీ నిన్ను బంధిస్తుంది.

సన్యాసం అంటే కాషాయ బట్టలు వేసుకోవటం సన్యాసం కాదు. కర్మఫలాన్ని ఆశించకుండా చేసేవాడు గృహస్థు అయినా వాడు సన్యాసే. నాలుగు డబ్బాల నెయ్యి తెచ్చి అగ్నికి ఆహుతి చేయటం యజ్ఞం అనుకొంటాము. కాని నీవు స్వార్థం లేకుండా పనిచేస్తే, ఇతరులకు ఉపకారం చేసినా తిరిగి వారినుండి ఉపకారం ఆశించకుండా ఉంటే అది యజ్ఞంతో సమానము. కర్మఫలత్యాగి సన్యాసి, స్వార్థత్యాగి యజ్ఞ పురుషుడు. నీవు అరణ్యానికి వెళ్లటం వలన ఏకాంతవాసంరాదు. భగవంతుడు ఎక్కడ ఉన్నాడో అక్కడికి నీ మనస్సు జరుగుతూ ఉంటే, నీవు పదిమందిలో ఉన్నా, లక్షమందిలో ఉన్నా నీకు ఏకాంతవాసం వస్తుంది. మనస్సు బాహ్యవిషయముల వెంటపడక లోదృష్టి కలిగేటట్లు చూసుకోవాలి. నీ మాట, పని, తలంపు అన్నీకూడా నీకు అంతర్‌దృష్టి కలగటానికి సహకరించాలి. కొంతమంది గొప్పలు చెప్పకొంటూ ఉంటారు. దానివలన మనస్సు బాహ్యాముఖం అవుతుంది. ఎంతసేవు నీవు ఇతరుల మనస్సును చూస్తున్నావు గాని నీ మనస్సును నీవు చూసుకోవటంలేదు. ఇతరుల మనస్సును చూడటం మానివెయ్యి. నీ మనస్సును చూసుకొంటే నీ బలహీనతలు తెలుస్తాయి. వాటిని తొలగించుకొంటే నీవు బాగుపడతావు. దేహం ప్రారబ్దం ప్రకారం నడుస్తూ వుంటుంది. నీ ప్రారబ్దాన్ని బట్టి పనిచేసుకో. కాని లోపల అవి అన్నీ మోయవద్దు. లోపల అన్నీ పెట్టుకొంటే నీవు

మునిగిపోతావు. చావు వచ్చేవరకు దేహం తిరుగుతూ వుంటుంది. పొగిడేవాళ్ళు పొగుడుతూ వుంటారు, తిట్టేవారు తిడుతూ వుంటారు అది దేహప్రారబ్ధం. దాని గొడవ నీకు ఎందుకు? బయట పని చేస్తూ ఉండు, లోపల మలిన్యం పెట్టుకోవద్దు. అమృతస్థితి ఎక్కడ ఉందో ఆ వైపుకు నీ మనస్సు ఎంతవరకూ జరుగుతోందో చూసుకో.

మీరు ఏకాంతంగా కూర్చొన్నప్పుడు పునర్జన్మను తీసుకొని వచ్చే విషయాలు మనలో ఏమి ఉన్నాయెూ చూసుకోవాలి. ఆ విషయాలను మీరు పట్టుకొని వాటిలో నుండి బయటపడటానికి ప్రయత్నంచేయాలి. అదే సాధన. దేహానికి, లోపల ఉన్న ఆత్మకు ఎట్టి సంబంధం లేదు. చావులేని ఆత్మతో తాదాప్యం పొందటం మానివేసి చనిపోయే దేహంతో తాదాప్యం పొందుతున్నాము. ఇక్కడే మనం పొరపాటు చేస్తున్నాము. దేహంతో తాదాప్యం మానివేసి ఆత్మతో తాదాప్యం పొందితే నీవు జ్ఞానివి అవుతావు. ఈ లోకంలో నిజమైన సుఖి ఒక్క జ్ఞాని మాత్రమే. నేను పూజలు చేస్తున్నాను, జపాలు చేస్తున్నాను అంటే సరిపోదు. చేసుకోమంచిదే కాని దైనందిన జీవితంలో నీ ఆచరణ ధర్మంగా ఉండాలి, సరళంగా ఉండాలి, క్రమంగా ఉండాలి. ధర్మాన్ని ఆచరించటం వలన బ్రహ్మం తెలియబడుతుంది. దైనందిన జీవితం క్రమంగా లేనప్పడు మీరు పూజలు, జపాలు చేసినా పుణ్యం రావచ్చును గాని బ్రహ్మం తెలియబడదు. జ్ఞాని అంటే ఆనంద సముద్రుడు, జ్ఞానసముద్రుడు. వర్షం వచ్చి భూమిని ఎలా తడుపుతుందో అలాగ జ్ఞాని నుండివచ్చే ఆనందతరంగాలు, శాంతి తరంగాలు మానవజాతిని ఆనందముతో, శాంతితో తడుపుతూఉంటాయి.

దేహమే నేను అని దేహానికి పరిమితమై ఉన్న వారికి రాగద్వేషములు ఉంటాయి గాని దేహబుద్ధి దాటిన వాడికి రాగద్వేషములు ఏమిటి అన్నాడు భగవంతుడు. నీకు దేహభావన ఉంటే ఇష్టం, అయిష్టం ఉంటుంది. నీకే దేహభావన లేనప్పడు ఇష్టంలేదు, అయిష్టంలేదు. మిత్రులులేరు, శత్రువులు లేరు. నీలోపల ఉన్న ఆత్మ నీవు కాదు అనుకొంటున్నావు. ఈ దేహమే నీవు అనుకొంటున్నావు, ఇంద్రియాలు నీవు అనుకొంటున్నావు. ఇంద్రియాల ద్వారా ఏ విషయాలలోనికి వెళుతున్నావో ఆ విషయాలే నీవు అనుకొంటున్నావు. నీవు కానివి నీవు అనుకొంటున్నావు. నీవు ఏదైతే అవునో దానిని వదిలేసావు. అందుచేత ఆకర్షణ కలుగుతోంది. ఏది చూసినా ఆకర్షణే. ఎందుచేత ఆకర్షణ అంటే నీవు ఏదైతే అవునో అది మర్చిపోయావు. ఏదైతే కాదో అది అవును అనుకొంటున్నావు. అందుచేత ఆక్షరణ కలుగుతోంది. ఏ విషయాలు మీద ఆకర్షణ కలుగుతోందో నీకు తెలుస్తూ ఉంటుంది. వాటిని తొలగించాలి. దేహం ద్వారా ఎవడు ఆకర్షించబడుతున్నాడు అని విచారణ చెయ్యి. వాడే మిధ్యా నేను అని తెలుస్తుంది. వాడు ఉన్నంతసేపు ఆకర్షణ కలుగుతుంది మన అందరికి పూర్వజన్మలు ఉన్నాయికాని అన్నీ మర్చిపోయాము. పూర్వజన్మ దేహాలు మనకు జ్ఞాపకం లేకపోయినా అప్పడు మీరు ఏపని చేసినట్లు గుర్తు అంటే ఏ విషయాలు అయితే ఇప్పడు మిమ్మల్ని ఎక్కువ ఆకర్షిస్తున్నాయెూ ఆవిషయాలు మీరు పూర్వజన్మలోఎక్కువ భోగించినట్లు లెక్క అని చెప్పారు. స్థూలదేహం స్మశానంలో కాలిపోతుంది. సూక్ష్మదేహం అంటే మనస్సు కాలదు. అందులోనే వాసనలు

ఉంటాయి. మీ మనస్సులో ఉన్న వాసనలను బట్టి ఈశ్వరుడు ఆ వాసనలకు తగిన దేహాన్ని ఇస్తాడు.

నీకు ఆత్మనిష్ఠ ఉండాలి. నీ పొట్టకోసం ఏ వృత్తి చేసిన నీ గమ్యం మర్చిపోకూడదు. నీ జీవితయాత్రలో ఎక్కడో పుడతావు, ఎక్కడో మరణిస్తావు అది నీ గమ్యం కాదు. నీమనస్సు ఎప్పుడూ బ్రహ్మం మీద ఉండాలి. మనం శృంగవృక్షంలో ఉన్నాము. శృంగవృక్షంలోనే ఉండి శృంగవృక్షం ఎలా వెళ్ళాలి అనుకోవటం ఎటువంటిదో నేను బ్రహ్మమును తెలుసుకోవాలి అనుకోవటం కూడా అటువంటిదే ఎందుచేత నీవు బ్రహ్మమే. అయితే నీకు ఆశాంతి ఎందుకు వస్తుంది అంటే నీవు బ్రహ్మం అని నీకు తెలియకపోవటం వలన అశాంతి వస్తోంది.

గౌరవాలకు అగౌరవాలకు మంచికి చెడ్డకు భగవాన్ అసలు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎందుచేతనంటే పాపం ఇక్కడే ప్రారంభమవుతుంది. వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అనుకొంటూ ఉంటే నీకు పాపం ఉంది కాబట్టి వాడు చెడ్డవాడు, వీడు మంచివాడు అని నీ పాపం విడదీస్తుంది. బ్రహ్మం ఏమీ అనుకోదు. మంచి చెడ్డ అన్నీ నీ మనస్సులో ఉన్నాయి. మంచివాడిలోను, చెడ్డవాడిలోనూ కూడా బ్రహ్మం ఉంది. వాడి గుణాలను బట్టి మంచివాడు, చెడ్డవాడు అంటున్నాము. ఇవి అన్నీ మనస్సులో ఉన్నాయి. ఇలా వేరుపరచటంలోనే పాపం అంతా ఉంది. మనం ధనం ఉన్నవాడిని ఒకలాగ చూస్తాము, ధనం లేనివాడిని ఒకలాగ చూస్తాము. అధికారంలో ఉన్నవాడిని ఒకలాగ చూస్తాము, అధికారం లేనివాడిని ఒకలాగ చూస్తాము. పాపం ఇక్కడే ప్రారంభమవుతుంది. మనస్సులో ఉన్న దోషం వలన ఎక్కడికక్కడ విడదీసేస్తుంది. మన మనస్సులో ఏదోషం ఉందో మనం చూసుకోవాలి.

అహంకారము అంటే నేను, మమకారం అంటే నాది. ఈ రెండు దోషములు మనస్సులో ఉన్నాయి. మనకు వచ్చే చిల్లర గొడవలు అసూయ, కోపం ఇవి అన్నీ ఆకులు కొమ్మల వంటివి. అహంకారం, మమకారం తల్లి వేరు వంటివి. ఇవి లోపల ఉంటాయి. ఇవి మనకు కనబడటంలేదు. అందువలన లేవు అనుకొంటున్నాము. ఈ రెండు దోషముల నుండి మనస్సు విడుదల పొందినప్పుడు కదా అదిశుద్ధమై ఆత్మాకారం చెందేది, అంతేగాని నేను నదిలో స్నానం చేసాను, గుడి చుట్టూ తిరిగాను అంటే చేస్తే చేసుకో కాని ఈ రెండు దోషముల నుండి విడుదలపొందు. మీరు పూజలు చేసుకోండి, ధ్యానాలు చేసుకోండి మంచిదే కాని సత్‌ప్రవర్తన లేకుండా సత్యవస్తువు నీకు తెలియబడదు. శాంతియుతమైన జీవితం, విచక్షణతో కూడిన జీవితం, వివేకవంతమైన జీవితం, మధురమైన జీవితం వలన నీలోపల ఉన్న బ్రహ్మం పులకించి, స్పందించి ఏదో రోజు ముహూర్తం పెట్టుకొని మనకు తెలియబడుతుంది. బ్రహ్మం అంటే మొద్దు అని అనుకోకండి. దానికోసం మీరు ఎంత కష్టపడుతున్నారో మన తపన అంతా అది చూస్తూ ఉంటుంది. మీకు ఎప్పుడు తెలియబడాలో మహూర్తం పెట్టుకొని ఆరోజు తెలియబడుతుంది. మీరు ఎదురుచూడవద్దు. మీరు శ్రద్ధగా చేస్తే అదేవచ్చి మిమ్మల్ని వరిస్తుంది.

❄ ❄ ❄